క్లుప్తంగా

పోతారంలో కేంద్ర బృందం పర్యటన



నర్సరీని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

బెజ్జంకి(సిద్దిపేట): కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న పనులను పరిశీలించేందుకు బుధవారం ఎన్ఎల్ఎం (నేషనల్ లైవ్‌హుడ్ మిషన్), కేంద్ర బృందం సభ్యులు జోసెఫ్, వినోద్‌లు మండలంలోని పోతారంలో పర్యటించారు. కేంద్ర నిధులతో చేపట్టిన ఉపాధి హామీ, నర్సరీ, ఇందిరమ్మ ఇల్లు, డంపింగ్ యార్డులను పరిశీలించారు. బెజ్జంకిలోని ఇందిరమ్మ మహిళ శక్తి క్యాంటీన్‌లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి



బండి సంజయ్‌కి వినతిపత్రం ఇస్తున్న శంకర్‌బాబు

హుస్నాబాద్: కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని బుధవారం హుస్నాబాద్ పట్టణ బీజేపీ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, వేంకటేశ్వర ఆలయ కమిటీ సభ్యులు కలిశారు. ఆలయ ప్రహరీ, ముఖ ద్వార తోరణ నిర్మాణానికి, ఇతర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందని తెలిపారు. బండి సంజయ్ జన్మదినం సందర్భంగా పేద విద్యార్థులకు మోదీ కానుక సైకిళ్ల పంపిణీ కార్యక్రమం వచ్చే వారంలో ఉంటుందని వెల్లడించారు. మంత్రిని కలిసిన వారిలో ఆలయ చైర్మన్ మురళీధర్ స్వామి, ప్రధాన కార్యదర్శి అనంతస్వామి, కోశాధికారి మంథని శ్రీనివాస్‌లు ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఆధ్వర్యంలో బుధవారం వివిధ అంశాలపై అవగాహన నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ఉండాలంటే ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాకారులు కొమ్ము రవీందర్, దేవదాసు, ఎల్లయ్య, తదితరులున్నారు.

వర్షాల కోసం కప్పతల్లి ఆటలు



కప్పతల్లి ఆటలు ఆడుతున్న రైతులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం కూచనపెల్లిలో బుధవారం వర్షాలు కురువాలని రైతులు కప్ప తల్లి ఆటలు ఆడారు. తొలకరి వానలకు విత్తనాలు వేసిన రైతుల పంట నీళ్లు లేక ఎండిపోవడంతో రైతులు వరుణుడు కరుణించి వానలు కురుపించాలని కప్పతల్లిని వేడుకున్నారు. మహిళలు గ్రామ దేవతలకు జలాభిషేకాలు చేసి వానలు కురుపించాలని వేడుకున్నారు.

సంగీతకు అభినందనలు



సంగీతను అభినందిస్తున్న వైద్యులు, సిబ్బంది

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎస్.సంగీతను వైద్యులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఇప్పటివరకు ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ శాంతి స్థానంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల గైనకాలజీ విభాగ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సంగీత పదోన్నతిపై సిద్దిపేటకు వచ్చింది. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది భవాని గౌడ్, యాదమ్మ, శ్రీలత, అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఉత్తీర్ణతలో 'సిర్సనగండ్ల' ఆదర్శం

- వరుసగా ఏడేళ్లు వందశాతం పాస్
- రెండేళ్లుగా ట్రిపుల్ ఐటీలో అవకాశాలు
- పాఠశాల పనితీరుపై ఎంఈఓ ప్రశంస



సిర్సనగండ్ల హైస్కూల్

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని సిర్సనగండ్ల హైస్కూల్ వరుసగా ఏడేళ్లుగా 10వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణతను సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తుంది. రెండేళ్ల నుంచి పాఠశాలలోని విద్యార్థులకు బాసరలోని ట్రిపుల్ ఐటీలో సీట్లు దక్కాయి. 2018 నుంచి 2025 వరకు వరుసగా 10వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణతను సాధిస్తూ వస్తుంది. మెరుగైన విద్యాబోధనలు, మంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా ఆవరణ చుట్టూ పచ్చని చెట్లు, నిశినాథులైన అధ్యాపకులున్నారు. ఎండాకాలంలో సైతం చెట్లు ఎండిపోకుండా స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో నీటి వసతిని ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం మండల విద్యాధికారిగా పని చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, హైస్కూల్లో 8 ఏళ్ల పాటు హెచ్ఎంగా పని చేశారు. అప్పటి నుంచి హైస్కూల్ పేరు ప్రతిష్టలు పెరుగుతూ వస్తున్నాయి. సిద్దిపేట పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాలు ఇందిరానగర్, నాగిరెడ్డిపల్లి నుంచి విద్యార్థులు హైస్కూల్‌కు వస్తున్నారు. హైస్కూల్లో 230 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. కలెక్టరుతో పాటు రాష్ట్ర, జిల్లాస్థాయి విద్యాధికారులు హైస్కూల్‌ను సందర్శించి నిర్వహణ తీరుపై సంతృప్తిని వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి. వరుసగా రెండేళ్లుగా ట్రిపుల్ ఐటీలో సీట్లు దక్కడంపై, విద్యార్థులను, ఉపాధ్యాయులను ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

ఉపాధ్యాయుల ప్రోత్సాహం



మాది పేద కుటుంబం. వేరే గ్రామమైనా హైస్కూల్లో వరుసగా మంచి ఫలితాలు వస్తుండటంతో చేరాను. 10వ తరగతిలో ఎక్కువ మార్కులు వచ్చేలా ఉపాధ్యాయులు ఎంతో పోత్సాహం అందించారు. దీంతో కష్టపడి ట్రిపుల్ ఐటీలో సీటు దక్కించుకున్నాను.

– పోశం నక్షత్ర నాగిరెడ్డిపల్లి, విద్యార్థిని

కష్టాలే సీటు దక్కేలా చేశాయి



ఏరోజు పాఠాలను ఆ రోజు ఇంటికి వెళ్లాక చదువుకుంటూ పుస్తకంలో రాశాను. ఇలా చేయడంతో జ్ఞాపక శక్తి మరింతగా పెరుగుతూ వచ్చింది. తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు ఎప్పుడూ గుర్తుకు వస్తుండం ట్రిపుల్ ఐటీ సీటు వచ్చేలా చేశాయి.

– ఇరుకుల హేమ, సిర్సనగండ్ల విద్యార్థిని

మంచి ఫలితాలు వచ్చేలా..



హైస్కూల్ అభివృద్ధిలో గ్రామస్తుల సహకారం పూర్తిస్థాయిలో లభిస్తుంది. దీనికి తోడు ఉపాధ్యాయుల పని తీరు బాగుంది. కష్టపడి చదివేతత్వం విద్యార్థుల్లో ఉంటుంది. మండల వ్యాప్తంగా మంచి ఉత్తీర్ణతలు వచ్చేలా చూస్తాం.

– పురుమాండ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ

సమాజాన్ని చైతన్యపరిచే బాధ్యత మీడియాదే

- సీనియర్ పాత్రికేయులు, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి



సదస్సులో ప్రసంగిస్తున్న దిలీప్‌రెడ్డి, విరాహత్‌అలీ

వర్గల్(గజ్వేల్): సమాజాన్ని చైతన్యపరిచే బాధ్యత మీడియా తీసుకోవాలని రాష్ట్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్, సీనియర్ పాత్రికేయులు దిలీప్‌రెడ్డి అన్నారు. బుధవారం వర్గల్ మండలం శాకారంలోని పీజీఆర్ గార్డెన్స్‌లో 'సమకాలిన పరిస్థితులు–జర్నలిస్టుల పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ప్రధాన వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. అన్ని రంగాల మాదిరిగానే మీడియాలోనూ ఎన్నో మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. ప్రత్యేకించి సోషల్‌మీడియా వికృతరూపం దాల్చడం వల్ల దుష్ఫలితాలు వస్తున్నాయన్నారు. రాబోయే కాలంలో ఈ విధానాన్ని నియంత్రించడానికి చట్ట పరిమితులు వస్తాయని ఆకాంక్షించారు. సమాజం బాగుండాలనే విశాల దృక్పథంతో మీడియా పనిచేస్తే పరివర్తన సాధ్యమవుతుందని వివరించారు. గజ్వేల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ మాట్లాడుతూ.. గజ్వేల్ ప్రెస్‌క్లబ్ గజ్వేల్‌లోని వినూత్న కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్నదన్నారు. 25ఏళ్ల ప్రస్థానంలో అభాగ్యులకు అండగా నిలిచిందన్నారు. దళితులపై దాడులు, వరకట్న హత్యలు, మంత్రాల నెపంతో దాడులు, అశ్లీల సంస్కృతి, గుట్కాకు వ్యతిరేకంగా ఎన్నో కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. సాహితీ, సాంస్కృతికోద్యమాల్లోనూ తమదైన పాత్ర పోషించిందని తెలిపారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రంగాచారి, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, వంటిమామిడి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ప్రభాకర్‌గుప్తా, వర్గల్ తహసీల్దార్ బాల్‌రాజు, ములుగు ఏడీఏ అనిల్, వెటర్నరీ ఏడీ రమేష్‌బాబు, నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ రాజేందర్, రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం



అక్కన్నపేట(హుస్నాబాద్): మార్నింగ్ వాక్‌కు వెళ్లే పలువురు కొండచిలువను చూసి పరుగులు పెట్టారు. ఈ సంఘటన అక్కన్నపేట మండలం గుబ్బడిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామ సమీపంలో గుబ్బడి గుట్ట కింది పలువురు మార్నింగ్ వాక్‌కు వెళ్తుంటారు. ఈ క్రమంలో రోజుమాదిరిగానే బుధవారం రోడ్డు పక్కనే సుమారుగా 7,8 అడుగుల పెద్ద కొండచిలువ ఉండడంతో భయంతో పరుగులు తీశారు. దీంతో నలుగురు కలిసి ప్రాణరక్షణ కోసం కొండచిలువను హతమార్చారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఏఎస్ఐ వెంకట్ గౌడ్

చిన్నకోడూరు(సిద్దిపేట): యువత మత్తు పదార్థాలకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఏఎస్ఐ వెంకట్ గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాలలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్‌తో పాటు ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్లరాదన్నారు. చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సతీష్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల ఇబ్బందులు పట్టవా ?

- బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: జిల్లాలోనే మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ నుంచి కాలువల్లోకి సాగునీటిని విడుదల చేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలం పరిధి కొడకండ్లలోని కొండపోచమ్మసాగర్ కాలువ వద్ద సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తర తెలంగాణకు వరప్రదాయినిగా కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ నిర్మించారని కొనియాడారు. తెలంగాణలో కరువును శాశ్వతంగా పారదోలడానికి కేసీఆర్ ప్రయత్నిస్తే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులను ప్రజల్లో బద్నాం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకు సాగుతున్నాదన్నారు. నేడు కాళేశ్వరం ప్రాజెక్టుల నుంచి నీరు వస్తేనే రైతులకు మేలు జరిగే అవకాశముందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం నాట్లు వేసుకోలేక, వేసిన చోట పంటలు ఎండిపోతుండగా రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ బొల్లారం ఎల్లయ్య, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- టూ టౌన్ ఎస్ఐ రాజేశం



అవగాహన కల్పిస్తున్న టూటౌన్ ఎస్ఐ రాజేశం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రాజేశం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు, షీటీం విధులు, ర్యాగింగ్, ఫోక్సో, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజేశం మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దన్నారు. సోషల్ మీడియాకు ఎంతదూరంగా ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుందన్నారు. చదువుకునే సమయంలో చెడు అలవాట్లకు బానిస కావొద్దని చెప్పారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేసిన, అవహేళనగా మాట్లాడిన వెంటనే డయల్ 100, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ షీటీం నంబర్ 8712667434 కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ స్వాతి, అధ్యాపకులు, సిబ్బంది, షీటీం సభ్యులు, కానిస్టేబుల్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతితో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి

చిన్నకోడూరు(సిద్దిపేట): సేంద్రియ పద్ధతుల్లో పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి జయంత్‌కుమార్ అన్నారు. బుధవారం చిన్నకోడూరులో ఇఫ్కో, సౌభాగ్య సంస్థల ఆధ్వర్యంలో పంట దిగుబడులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నానో యూరియా, పోటాష్ వల్ల కలిగే ప్రయోజనాలపై వివరించారు. ఇఫ్కో జిల్లా మేనేజర్ చంద్రబాబు, సౌభాగ్య సంస్థ డైరెక్టర్ సామ్యూల్ మాట్లాడుతూ.. పంట దిగుబడులకు అమైనో యాసిడ్ వాడాలని సూచించారు. అమైనో యాసిడ్‌తో సాగు చేసిన పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ చైర్మన్ వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సంస్థల ప్రతినిధులు జగదీష్, ప్రియదర్శన్, నాగేంద్ర రైతులు తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇన్‌క్రెడిబుల్ టీవీ అండ్ మూవీ ఆర్టిస్ట్ ఫెడరేషన్ (ఫైమా) తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా సిద్దిపేట పట్టణానికి చెందిన రవితేజను నియమించారు. బుధవారం హైదరాబాద్‌లో ఫైమా సంస్థ వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షుడు చంగారపు నరోత్తం కుమార్ నియామక పత్రాన్ని అందించినట్లు తెలిపారు. ఈ నియామకం రెండు సంవత్సరాలు ఉంటుందని చెప్పారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. పట్టణ ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన వాహన తనిఖీల్లో 9మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని కోర్టులో హాజరుపరచగా బుధవారం విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.18,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

నేటి నుంచి ప్రాక్టికల్ పరీక్షలు

సిద్దిపేటఎడ్యుకేషన్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ చదువుతున్న సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ జరగనున్నాయి. ఈనెల 17 నుంచి నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట ప్రాంతీయ అభ్యాసకుల సహాయ కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రద్ధానందం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 వరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం, సాయంత్రం నిర్వహించనున్న ఈ పరీక్షలకు విద్యార్థులు తమ కళాశాల గుర్తింపు కార్డు, హాల్‌టికెట్లను వెంట తెచ్చుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు కళాశాలలోని రీజనల్ సెంటర్‌లోని 7382929615 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం

- ఎంఈఓ బచ్చలి సత్తయ్య



ఉపాధ్యాయులను సన్మానించిన ఎంఈఓ

కొండపాక(గజ్వేల్): ఉద్యోగులకు బదిలీలు సహజమని మండల విద్యాధికారి బచ్చలి సత్తయ్య పేర్కొన్నారు. కుకునూరుపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేసి బదిలీపై వెళ్లిన శ్రీనివాస్, పద్మ, శ్రీచరణలకు బుధవారం సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా బచ్చలి సత్తయ్య మాట్లాడుతూ.. ఉద్యోగ నిర్వహణ పనితీరులు విద్యార్థుల్లో ఎక్కువ రోజులు గుర్తుంటాయన్నారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి అపారమైన గౌరవం ఉందని తెలిపారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధనలు, మౌలిక వసతులు కల్పించడంతో విద్యార్థుల సంఖ్యలు పెరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, ఉపాధ్యాయులు రాంచంద్రం, నాగరాణి, శంకర్, స్వరూపరాణి, సీఆర్పీసంతోష్, నాయకులు అజీమొద్దీన్, సంపత్, నాగరాజు, కొంక సుదర్శన్, పాల శంకర్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

హేమరాజ్‌సింగ్‌కు సన్మానం

దుబ్బాక: రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఆస్పత్రిగా దుబ్బాక ఏరియా ఆస్పత్రి నిలవడంతో సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్‌ను బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి ర్యాకం శ్రీరాములు సన్మానించారు. బుధవారం ఆస్పత్రిలో ఆయనతో పాటు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించి, సన్మానించారు. ఆస్పత్రికి ఇంకా గొప్పపేరును తీసుకురావాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు చంద్రం, రాజనర్స్, భూమేష్ ఉన్నారు.

ఉన్నత లక్ష్యంతో ఎదగాలి

హుస్నాబాద్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు బుధవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని సక్రమ మార్గంలో నడవాలన్నారు. అధ్యాపకుల నుంచి జ్ఞానాన్ని పొందాలని సూచించారు. కళాశాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడానికి సిబ్బందిని పంపిస్తామన్నారు. కళాశాల ఆవరణలో నాటిన మొక్కలను ట్యాంకర్ ద్వారా నీటిని అందించడానికి సహకరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భిక్షపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ కార్డులు అందిస్తాం

హుస్నాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశం మేరకు మున్సిపల్ కార్యాలయంలో నమస్తే డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ మాట్లాడుతూ.. రోడ్లపై చెత్తను సేకరించే వారిని గుర్తించడమే నమస్తే డే ముఖ్యఉద్దేశమన్నారు. ఈ స్కీంలో ఆరుగురు మహిళా వేస్ట్ పిక్కర్లుగా గుర్తించినట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని డీఆర్సీసీలో ప్లాస్టిక్ వస్తువులు, అట్ట ముక్కలు, కవర్లు అన్ని రకాల పాడి చెత్తను తీసుకుంటారని చెప్పారు. గుర్తించిన వేస్ట్ పిక్కర్లకు ఆరోగ్యపరంగా ప్రభుత్వం నుంచి ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.